క్లుప్తంగా

పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ ప్రారంభం

మహబూబ్‌నగర్ రూరల్: బీసీ మేధావుల సంఘం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఆ సంఘం గౌరవ సలహాదారు బెక్కం జనార్దన్ బుధవారం ప్రారంభించారు. పట్టణంలోని నవ భారతి విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా పులే చిత్రపటానికి పూజలు చేశారు. కోచింగ్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రభాకర్, సత్యనారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిగా ప్రభు నాయక్

గండేడ్: జిల్లా గిరిజన మోర్చా ప్రధానకార్యదర్శిగా ప్రభునాయక్ నియమితులయ్యారు. ఆయన ఇదివరకు మండల శాఖ అధ్యక్షుడిగా పనిచేశారు. కాగా బుధవారం జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ అతడికి నియామక పత్రం అందజేశారు.

వాల్‌పోస్టర్ విడుదల

భూత్పూర్: మేడేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామ్మోహన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం మేడే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో భవన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, కోశాధికారి ఆంజనేయులు, ఏఐటీయూసీ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి తిరుపతయ్య, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవాబుపేట: ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మండల కేంద్రానికి చెందిన మ్యాదరి రవి తండ్రి వెంకటయ్య(67) మృతి చెందటంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యకర్తలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య, మాజీ సర్పంచ్ గోపాల్ ఉన్నారు.

ఆదుకుంటాం..

రాజాపూర్: గుండ్లపొట్లపల్లికి చెందిన ఉపాధి కూలీ లింగమ్మ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

భూత్పూర్: మద్దిగట్లకి చెందిన ఓ యువతి అదృశ్యం అయినట్లు భూత్పూర్ 2వ ఎస్‌ఐ శివ నాగేశ్వర్ నాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు యువతి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతుంది. ఈ క్రమంలోనే కాలేజీలో మీటింగ్ ఉందని ఈ నెల 12న ఇంట్లో నుంచి కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది. సాయంత్రం తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికారు. ఫలితం లేకపోవడంతో బుధవారం ఆమె తల్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదుచేశారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి



దేవరకద్ర: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని... ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేసి వివరించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రశాంత్‌రెడ్డిలు కోరారు. బుధవారం దేవరకద్రలో నియోజకవర్గానికి చెందిన అన్ని మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్ర నాయకులు ఎగ్గని నర్సింహులు, కుర్వ రమేశ్ ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

భూత్పూర్: మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన మిట్ట పోషయ్య (73) బుధవారం అనుమానాస్పదంగా మృతిచెందినట్లు భూత్పూర్ ఠాణా 2వ ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. గ్రామస్తుల కథనం మేరకు పోషయ్య కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా ఆయన ఈ నెల 12న ఇంట్లో చెప్పా పెట్టకుండా వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా తెలియరాలేదు. ఈ క్రమంలో బుధవారం గ్రామ సమీపంలో బోరోని గుట్టపై కుళ్లిన మృతదేహం పాటు కుక్కలు తినడంతో శరీర భాగాలు గుర్తించలేని విధంగా పడి ఉండడాన్ని మేకల కాపర్లు గుర్తించారు. గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. దీంతో పోషయ్యనే అని కుటుంబ సభ్యులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఘటన స్థలాన్ని పరిశీలించారు. రాములు కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఫలితాల్లో సత్తాచాటిన బాలికలు


చందన శ్రీ బైపీసీ (944)


అనూష ఎంపీసీ (932)


అక్షయ, సీఈసీ ప్రథమ(455)

సాక్షినెట్‌వర్క్: ఇంటర్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఫలితాల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకులాలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. అయాచోట్ల ఎక్కువగా అమ్మా యిలే టాపర్లుగా నిలవడం గమనార్హం.

మోడల్ స్కూల్‌లో 70 శాతం

గండేడ్ పరిధిలోని వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో సెకండ్ ఇయర్‌లో 70 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 72 మందికి 36 మంది ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. ఎంపీసీలో బి.ప్రియాంక 432, శిల్ప 426, భవానీ 403 మార్కులు సాధించారు. బైపీసీలో కృష్ణబాయి 394, శ్వేత 388, రజిత 372, ఎంఈసీలో లక్ష్మి 424, సీఈసీలో అక్షయ 455, జయశ్రీ 416, సంతోష 403 మార్కులు పొందారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో మాదారం అనూష 932, రూబిక 929, అన్నపూర్ణ 921, అదేవిధంగా బైపీసీలో చందనశ్రీ 944, అక్షయ, స్పందన 895, గాయత్రి 888, సీఈసీలో ప్రవల్లికకు 923, అంజలికి 895, గంగోత్రికి 858 మార్కులు వచ్చాయి.

భూత్పూర్ కళాశాలలో 50%

భూత్పూర్ ప్రభుత్వ కళాశాలలో ఫస్టియర్‌లో 40%, సెకండ్ ఇయర్‌లో 50% మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ పి. విజయ్ భాస్కర్ గుప్త తెలిపారు. సెకండ్ ఇయర్‌లో బైపీసీలో మహేశ్వరి 887, జయంతి 858, ఎంపీసీలో శ్రీవాణి 815 మార్కులు సాధించారు. ఫస్ట్‌ఇయర్ ఎంపీసీలో సౌమ్య 433, బైపీసీలో దీపిక 370, సంధ్య 346 సాధించారు.


సౌమ్య ఎంపీసీ (433)

జ్యోతిబాపులే బాలికల పాఠశాలలో బైపీసీలో మాధురికి 986, ఎంపీసీలో శిరీషకు 984 వచ్చాయని స్పెషల్ ఆఫీసర్ బస్వరాజ్ తెలిపారు. ఫస్టియర్‌లో బైపీసీలో సౌమ్య, సుప్రియలు 432 మార్కులు సాధించారు.

కోయిల్‌కొండలో..

కోయిల్‌కొండ ప్రభుత్వ కళాశాలలో బైపీసీలో 926 మార్కులతో గాయిత్రి టాపర్‌గా నిలిచింది. ఫస్టియర్‌లో 406తో బిందు టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపాల్ బాలనారాయణ తెలిపారు.


గాయత్రి


బిందు

జడ్చర్ల పరిధిలో..


లావణ్య ఎంపీసీ (980)


సునీత బైపీసీ (980)


శివాని ఎంపీసీ (964)


శ్యామ్ ఈటీ (980)


సానియా బైపీసీ (971)


సానియాబేగం బైపీసీ (980)

జడ్చర్ల పరిధిలో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కస్తూర్బాలో ఎంపీహెచ్‌డబ్ల్యూల కోర్సులో 100శాతం ఫలితాలు వచ్చాయి. బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 200 మందికి 141మంది (70 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 215 మందికి 107మంది (50శాతం) మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. కళాశాల టాపర్‌గా శివాని (ఎంపీసీలో 964) నిలిచింది. భావన 956, వెన్నెల 931, అనూష 925 మార్కులు సాధించారు. మొదటి ఏడాదిలో అయేషా సిద్దిఖి 463, మహిత బుస్సుమ్ 435, ముషరాఫ్ 402, శ్రీజ 482, కీర్తి 477 మార్కులు సాధించారు. కో ఎడ్యుకేషన్ బాలుర కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 153మందికి 87మంది (57శాతం) ఉత్తీర్ణులయ్యారు. మొదటి ఏడాదిలో 204 మందికి 87మంది (42శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఏడాదిలో శ్యాం 980 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. సానియా 971 మార్కులు, కిర్మాణి 968 మార్కులు సాధించాడు. కస్తూర్బాలో.. ఎంపీహెచ్‌డబ్ల్యూలో 29మందికి 29మంది, మొదటి ఏడాదిలో 34మందికి 31మంది ఉత్తీర్ణత పొందారు. టాపర్‌గా గాయత్రి (971 మార్కులు) నిలిచింది. సీఈసీ మొదటి ఏడాది 16 మందికి ఏడుగురు, రెండవ ఏడాదిలో 16 మందికి 6గురు మాత్రమే ఉత్తీర్ణత పొందారు. మైనార్టీ గురుకులంలో.. ద్వితీయ ఏడాదిలో 100శాతం ఫలితాలు వచ్చాయి. 49మందికి అందరూ ఉత్తీర్ణత పొందారు. మొదటి ఏడాదిలో 59 మందికి 54మంది ఉత్తీర్ణత సాదించారు. బైపీసీలో సానియాబేగం 980, ఎంపీసీలో కీర్తన 961మార్కులు సాధించింది. చిట్టెబోయిన్‌పల్లిలో.. సాంఘికసంక్షేమ గురుకుల పాఠశాలలో 100శాతం ఫలితాలు వచ్చాయి. ఎంపీసీలో 38, బైపీసీలో 39మందికి అందరూ ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ ఏడాదిలో ఎంపీసీలో 95శాతం, బైపీసీలో 97శాతం ఉత్తీర్ణత వచ్చింది. రెండు కోర్సుల్లోనూ లావణ్య, సునీత 980మార్కులతో టాపర్‌లుగా నిలిచారు.

దేవరకద్రలో 60 శాతం

దేవరకద్ర ప్రభుత్వ కళాశాలలో సెకండ్ ఇయర్‌లో 60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 195 మందికి 117 మంది ఉత్తీర్ణులయ్యారు. మండల టాపర్‌లుగా కేశవులు ఎంపీసీ 928, అశ్విని బైపీసీలో 930, సీఈసీలో మైత్రి 760, మానస హెచ్‌ఈసీలో 774 మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్‌లో ప్రియాంక ఎంపీసీ 412, శివాని బైపీసీ 377, శివయ్య సీఈసీ 410, సంతోష హెచ్‌ఈసీలో 354 మార్కులు సాధించి టాపర్‌లుగా నిలిచారు. భవిత జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ ఎంపీసలో రాజేశ్వరి 457, సాయి కుమార్ 450, స్వాతి 440, బైపీసీలో రామాంజనేయులు 395 మార్కులు సాధించి టాపర్‌లుగా నిలిచారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో అశోక్ 971, రాధిక 915, బైపీసీలో అర్చన 895, రూప 870, సీఈసీలో సపేరా నర్మీన్ 845, జలీల్‌పాషా 773, ఎమ్‌ఈసీలో ఫిరోజ్ 843, సీఈసీలో మైత్రి 723 మార్కులు సాధించారు.

బాలానగర్ పరిధిలో..


భవిత ఎంపీసీ (990)

మండల కేంద్రంలోని గురుకుల కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 40 మందికి అందరూ, బైపీసీ మొదటి సంవత్సరంలో 37 మందికి 37 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రియాంక, అనూష, శ్రావణి 435 మార్కులు, హారిక, నేహశ్రీ, యశోద, సోమచరితలు 434 మార్కులు సాధించారు. అదే విధంగా ఎంపీసీ మొదటి సంవత్సరంలో.. 43 మందికి 42 మంది ఉత్తీర్ణత సాధించారు. హర్షిత 467, అంకిత, యమున, అఖిల, మందిని 466 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 44 మందికి 44 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా భవిత 990 మార్కులతో టాపర్‌గా, దివ్య 984, ప్రశాంతి 981 సాధించారు. బైపీసీలో 39 మందికి 38 మంది ఉత్తీర్ణత సాధించగా అఖిల 977, అంకిత 974 మార్కులు పొందారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 124 మందికి 64 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదిలా ఉండగా మొదటి సంవత్సరంలో 175 విద్యార్థులకు కేవలం 44 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులు కావడం గమనార్హం.

కస్తూర్బాలో ఎంపీసీలో మానస 952, బైపీసీలో రాధ 924, మొదటి సంవత్సరం ఎంపీసీలో శ్రావణి 442, బైపీసీలో కీర్తన 431 మార్కులు సాధించారు.

యన్మన్‌గండ్లలో 58 శాతం


మధు బైపీసీ (939)


విజయ్‌కుమార్ ఒకేషనల్ (949)

నవాబుపేట పరిధిలోని యన్మన్‌గండ్ల ప్రభుత్వ కళాశాలలో 58 శాతం మాత్రమే ఉతీర్ణత నమోదైంది. కాగా ఒకేషనల్‌లో మాత్రం 95 శాతం ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో 124కి 72, ఫస్టియర్‌లో 121 మందికి 66 మంది ఉతీర్ణులయ్యారు. బైపీసీలో మధు 939తో టాపర్‌గా నిలిచాడు. మొదటి సంవత్సరంలో శ్రావణి 436తో టాపర్‌గా నిలిచింది. ఒకేషనల్‌లో.. విజయ్‌కుమార్ 949 మార్కులతో సాధించగా, శైలజ మొదటి సంవత్సరంలో 477 మార్కులతో టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు.

నంచర్ల గురుకులంలో 99 శాతం


గీత ఎంపీసీ(981)

మహమ్మదాబాద్ పరిధిలోని నంచర్ల గురుకులలో సెకండ్ ఇయర్‌లో 99 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఎంపీసీలో 981తో గీత టాపర్‌గా నిలిచింది. మైత్రి 950, వెంకటేశ్వరి 937 మార్కులు సాధించింది. బైపీసీలో ఎం.పూజ 967, అఖిల 967, వి.పూజ 948 మార్కులు సాధించారు. ఫస్టియర్‌లో మొత్తంగా 78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో సుధారాణి 418, అనురాధ 412, పావని 410, ఎంపీసీలో నందిని 454, కల్యాణి 452, వెంకటేశ్వరికి 448 మార్కులు సాధించారు.

మిడ్జిల్ లో 89శాతం ..


అంజలి ఎంపీసీ(455)


దర్శిరామ్ బైపీసీ (892)

మిడ్జిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో మొత్తం 118 మందికి 106 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటయ్య తెలిపారు. 89 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. ఇక బైపీసీలో దర్శిరామ్ 892 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచారు. లిఖిత 872 మార్కులతో ద్వితీయ స్థానం నిలిచిందన్నారు. ప్రథమ సంవత్సరంలో 119కి 72 మంది (60 ఉత్తీర్ణత సాధించారని వివరించారు. కె అంజలి ఎంపీసీలో 455తో టాపర్‌గా, మణికంఠ 441తో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. వెంకటేశ్వర పారా మెడికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 88 శాతం, ప్రథమ సంవత్సవరంలో 86 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

అడ్డాకులలో టాపర్లుగా అక్కాచెల్లెలు



అడ్డాకులలోని ప్రభుత్వ కళాశాలలో బాలికల హవా కొనసాగింది. రెండో సంవత్సరం బైపీసీ విభాగంలో అక్కా, చెల్లెల్లు ఎం.దీపిక 956 మార్కులు, ఎం.మౌనిక 938 మార్కులు సాధించగా అదే విభాగంలో నందిని 936 మార్కులు సాధించింది. ఎంపీసీ విభాగంలో కె.గాయత్రి 844, వి.శివకుమార్ 825 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో ఎల్.హేమలత 391 మార్కులు, బైపీసీ విభాగంలో టి.జ్యోతి 359 మార్కులు, సీఈసీ విభాగంలో బి.మానస 369 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ అంజన్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా గడిచిన రెండు, మూడేళ్లలో కళాశాలలో బాలికలే అత్యధిక మార్కులు సాధించగా ఈసారి కూడా బాలికలే అన్ని విభాగాల్లో మొదటి స్థానంలో నిలవడం విశేషం. కాగా టాపర్లుగా నిలిచిన బలీదుపల్లికి చెందిన అక్కా, చెల్లెల్లు ఎం.దీపిక, ఎం.మౌనిక రాష్ట్రస్థాయి ర్యాంకులు పొందినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. కాగా బాలికల తల్లి జ్యోతి కూలీ పనులు చేస్తూ వారిని చదివించడం విశేషం. కాగా జ్యోతిని కొన్నేళ్ల కిందట ఆమె భర్త వదిలేశారు. దీంతో ఆమె బలీదుపల్లిలోనే ఉంటూ విద్యార్థులను చక్కగా చదివించడంపై అధ్యాపకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా హనుమాన్ రథోత్సవం


పాలకొండలో రథాన్ని లాగుతున్న భక్తులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక తొమ్మిదో వార్డు పరిధిలోని పాలకొండలో బుధవారం తెల్లవారుజామున అభయాంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి మూల, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రంగురంగుల విద్యుద్దీపాలు, పూలతో అందంగా ముస్తాబు చేసిన రథంపై మేళతాళాల నడుమ విగ్రహాన్ని ఉంచారు. రథాన్ని వీధుల్లో ఊరేగించి తిరిగి ఆలయానికి చేర్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం శకటోత్సవం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో రద్దీ కనిపించింది. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వేడుకల్లో పాల్గొన్నారు. అదేవిధంగా బుధవారం రాత్రి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.

ఘనంగా రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చిన్నచింతకుంట: చిన్న వడ్డేమాన్ సమీపంలో వెలసిన రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారి రథోత్సవం వైభవంగా కొనసాగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి వారి రథాన్ని లాగారు. అలాగే బుధవారం రాత్రి ఆలయంలో భజనకార్యక్రమం నిర్వహించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

కోయిల్‌కొండలో..

కోయిల్‌కొండ: ఆచార్యపూర్‌లో బుధవారం తెల్లవారుజామున వీరభద్రుడి రథోత్సవం కనులపండువగా జరిగింది. భక్తులు నందికోళ సేవతో అడుగుల భజనలు, కోలాటాలతో అలరించారు. గురువారం తెల్లవారుజామున అగ్నిగుండం ఉంటుందని నిర్వాహకులు తమళి విజయ్, దిలీప్ తెలిపారు.



'కాంగ్రెస్ గెలుపును ఆపలేరు'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: బీజేపీ, బీఆర్‌ఎస్ ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ గెలుపును ఆపలేరని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఓటమి భయంతోనే బీజేపీ నాయకులు కాంగ్రెస్ మేనిఫెస్టోపై తప్పుడు ప్రచారం చేసున్నారన్నారు. మోదీ పాలనలో దేశంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తుందని, పదేళ్లలో ఆయన చేసిన అభివృద్ధి ఎక్కడా లేదన్నారు. అభివృద్ధి గురించి కాకుండా హిందుత్వం, రామాలయం పేరుతో ఓట్లు అడిగే ప్రయత్నం చేస్తుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. పాలమూరును అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ గత పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీ, కేసీఆర్ ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశారా అని ప్రశ్నించారు. ఇన్నాళ్లు ఇంట్లో కూర్చొని అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేసిన బీఆర్‌ఎస్ అధినేత బస్సు యాత్ర పేరుతో కాంగ్రెస్‌పై అక్కసుతో ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఐదు నెలల్లోనే మంజూరు చేసిన నిధులు, శంకుస్థాపనలు రూ.10 వేల కోట్ల పైమాటే అన్నారు. సమావేశంలో నాయకులు వినోద్‌కుమార్, జహీర్ అఖ్తర్, శ్రీకాంత్‌గౌడ్, మిథున్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

భూత్పూర్: తాటికొండలో ఎమ్మెల్యే జి. మధుసుదన్‌రెడ్డి వీరభద్ర స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనుబంధ గ్రామమైన నెహ్రూనగర్ కాలనీలో మంచి నీటి ఎద్దడిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అడ్డాకుల అధ్యక్షుడు నాగిరెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

స్టేషన్ మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మున్నూరు రవి, పటేల్ వెంకటేశ్ ముదిరాజ్‌తోపాటు పలువురు బుధవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: కారుకొండ బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గ్రామానికి చెందిన భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 40 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ఎంపీటీసీ తులసీరాంనాయక్, వెంకటేష్, నీల్యా, సత్యం, నర్సింహ, వెంకటయ్య, అంజనేయులు తదితరులు ఉన్నారు.

భూత్పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న ప్రజా పాలనకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో నాయకులు, కార్యకర్తలు చేరుతున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసుదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాత మొల్గరలో జరిగిన సమావేశంలో ఎల్కిచర్ల, పాత మొల్గర, మద్దిగట్ల గ్రామాలకు చెందిన 80 మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

సామరస్యంగా పరిష్కరించుకోవచ్చు

స్టేషన్ మహబూబ్‌నగర్: సమస్యలను సామరస్యంగా ఎలా పరిష్కరించుకోవచ్చో పట్టణంలోని తిమ్మసానిపల్లికి చెందిన యువకులను చూసి నేర్చుకోవచ్చని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైనార్టీ సోదరులకు స్మశానవాటికకు దారిలేక గత కొన్ని ఏళ్లుగా ఎంతో ఆవేదనకు గురయ్యారని, గ్రామ యువకుల చొరవతో సమస్య తీరిందన్నారు. మైనార్టీల స్మశానవాటికకు దారి ఇచ్చేందుకు కురుమయాదవులు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో తిమ్మసానిపల్లి వార్డు మైనార్టీలు ఎమ్మెల్యేను కలిసి దారి సమస్య తీరడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మౌలానా నాసిర్, అన్వర్, హకీం, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ సంక్షేమ సంఘం క్యాలెండర్లను బుధవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పులిజాల రవికిరణ్ తన జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థుల కోసం నోటుబుక్కులను అందజేశారు. రవికిరణ్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

మద్యం పట్టివేత

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో బుధవారం రాత్రి 10:30 గంటలకు ఎఫ్‌ఎస్‌టీ టీం–2 బృందం వాహనాల తనిఖీలు చేపడుతుండగా ఓ వాహనంలోని డిక్కీలో రూ.9వేల విలువ గల మద్యం కాటన్‌లు పట్టుబడ్డాయి. మహబూబ్‌నగర్ వెళ్తుండగా వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. అధికారులు దత్తత్రేయ, నాగరాజు మాట్లాడుతూ మద్యంతో పాటు వాహనాన్ని జిల్లా కేంద్రంలోని ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి తీసుకెళ్తున్నట్లు వివరించారు.

'జలజం' విద్యార్థుల సంబరాలు


కేక్‌కట్ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని జలజం కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు ఎంఈసీలో సోనల్ కంకణి 975, సీనియర్ సీఈసీ కల్పన 968, షమిత 946, విజయ్ 944, జూనియర్ ఎంఈసీలో 500, వినయ్ 491, మనోజ్‌కుమార్ 490, జూనియర్ సీఈసీలో వేదిక బంగ్ 476, శివనందు 474, హెచ్‌ఈసీలో లక్ష్మీబాయి 459 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

జోరందుకున్న ఉల్లి వ్యాపారం

- క్వింటాల్ గరిష్టంగా రూ.1,600.. కనిష్టంగా రూ.1,200


మార్కెట్‌లో ఉల్లి కొంటున్న వినియోగదారులు

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది. రెండు వారాలుగా ఉల్లి వేలం వేయకపోవడంతో ఈసారి వినియోగదారులు పెద్దఎత్తున మార్కెట్‌కు తరలివచ్చారు. మార్కెట్‌కు వందలాది మంది రైతులు ఉల్లిని అమ్మకానికి తేవడంతో వ్యాపారులు వేలం వేయకుండానే సగానికి సగం ఉల్లిని ముందుగానే కొనుగోలు చేశారు. మిగిలిన కుప్పలకు మధ్యాహ్నం వరకు వేలం జరిగింది. నిల్వ చేసుకోవడానికి చాలామంది వినియోగదారులు బస్తాలుగా కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చిన ఉల్లి నాణ్యతగా ఉండడంతో మార్కెట్‌కు దాదాపు 2 వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది.

45 కిలోల బస్తా రూ.800

మార్కెట్‌లో 45 కిలోల ఉల్లి బస్తా గరిష్టంగా రూ.800 వరకు విక్రయించారు. కనిష్టంగా రూ.600 వరకు అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చిన ఉల్లి నాణ్యతగా, బాగా ఆరబెట్టింది కావడంతో చాలామంది వినియోగదారులు బస్తాలుగా కొనుగోలు చేశారు. ఉల్లి సీజన్ తర్వాత ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తుగానే తక్కువ ధరలో ఉల్లిని కొనే అవకాశం రావడంతో వినియోగదారులు ఎగబడ్డారు. వ్యాపారులు ఇదే అదునుగా మార్కెట్‌కు వచ్చిన ఉల్లిని అంతా కొనుగోలు చేసి అమ్మకాలు సాగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్కెట్ అంతా సందడిగా మారింది.

సోనామసూరి ధర రూ.2,459

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగిన టెండర్లలో సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,459, కనిష్టంగా రూ.1,909 ధరలు లభించాయి. అలాగే ఆముదాలు సరాసరిగా రూ.5,429 ధర పలికింది.

ఓటు హక్కుపై ర్యాలీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో బుధవారం మున్సిపల్, మెప్మా సిబ్బందితో కలిసి అధికారులు 'ఓటుహక్కు ప్రాముఖ్యత'పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అందరూ తప్పనిసరిగా ఓటేయాలని ఆర్‌పీలు, మహిళా సంఘ సభ్యులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. బస్టాండు చౌరస్తాలో కళాజాత బృందం గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం స్వీప్ నోడల్ అధికారి డా.శ్రీధర్‌సుమన్ మాట్లాడుతూ ఓటరు చైతన్యం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం వివిధ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. 85ఏళ్లు దాటిన వయోధికులకు వారి ఇంటి వద్దే ఓటు వేసుకునేలా 'హోం ఓటింగ్' సౌకర్యం కల్పించామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సునీల్, మెప్మా డీఎంసీ శివకుమార్, టీఎంసీ కరుణాకర్‌గౌడ్, సిబ్బంది మాసూంబాబా, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రైతుల పోస్టుకార్డులు



జడ్చర్ల: సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం పెద్ద ఆదిరాలకి చెందిన పలువురు రైతులు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు రాశారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చి హామీలు నెరవేర్చాలని వారు కోరారు. ప్రధానంగా రైతు రుణమాఫీ, ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్, రైతు భరోసా, కౌలు రైతులకు రైత భరోసా, తదితరాలు నెరవేర్చాలని కోరారు. బీరయ్య, నర్సింహ, పర్షనాయక్, చెన్నయ్య, బాలయ్య, రాంచంద్రయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.